# సాక్షి ఆదిలాబాద్

మంగళవారం ၊ 9 ၊ మే ၊ 2023

7




**పులి కోసం జింకల పునరుత్పత్తి**

జన్నారం అటవీ డివిజన్‌లో రూ.83 లక్షలతో జింకల పునరుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో 40 జింకలను తీసుకురానున్నారు. 8లో▸



**కలెక్టరేట్ ఎదుట ఏఎన్ఎంల ధర్నా**

కైలాస్‌నగర్: తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సెకండ్ ఏఎన్ఎంలు సోమవారం ఆందోళన చేపట్టారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఇందులో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గరిష్టం/కనిష్టం
40.0/28.0

**వాతావరణం**

పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత కొనసాగనుంది.

## న్యూస్‌రీల్

### విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండడంతో పాటు పనితీరు మెరుగు పరుచుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. కార్యాలయంతో పాటు పరిసరాలను పరిశీలించి ఆవరణలో మొక్క నాటారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. పెండింగ్ కేసుల వివరాలపై ఆరా తీశారు. ప్రజలకు పోలీసులపై నమ్మకం పెంపొందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టాలన్నారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ బి రఘుపతి, ఎస్సై నాగనాథ్, సర్కిల్ ఎస్సైలు విష్ణువర్ధన్, అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో చేరిన 'కంది'



ప్రియాంకగాంధీ, రేవంత్‌తో వేదికపై 'కంది'

ఆదిలాబాద్‌టౌన్: కేఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కంది శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన యువ సంఘర్షణ సభకు హాజరైన ప్రియాంక గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, జిల్లాకు చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

### అప్రెంటిస్‌షిప్ మేళాకు స్పందన



ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న నిర్వాహకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లో సోమవారం నిర్వహించిన ప్రధానమంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళాకు స్పందన లభించింది. ఐటీసీ ఫుడ్ డివిజన్ లిమిటెడ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాకు 97 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరికి నిర్వాహకులు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఎంపికైన వారికి ఏడాది పాటు అప్రెంటిషిప్ కల్పిస్తామని, శిక్షణ కాలంలో రూ.11వేల స్టైఫండ్ చెల్లించనున్నట్లు ఐటీసీ ఫుడ్ డివిజన్ నిర్వాహకులు సూర్యభగవాన్ తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, నావిద్, సౌరబ్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

### బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి రేపు ప్రవేశపరీక్ష

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8వ తరగతిలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం బుధవారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్‌సీవో గోపీచంద్ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

### నిరాదరణకు గురైతే ఫిర్యాదు చేయొచ్చు

కైలాస్‌నగర్: పిల్లల నుంచి నిరాదరణకు గురైన వయోవృద్ధులు తమ సమస్యల సత్వర పరిష్కారానికి వయోవృద్ధుల సంక్షేమ శాఖ రూపొందించిన వెబ్ పోర్టల్‌ను వినియోగించుకోవాలని ఆర్డీవో రాథోడ్ రమేశ్ అన్నారు. ఈ వెబ్ పోర్టల్‌ను తన చాంబర్‌లో సోమవారం ప్రారంభించి మాట్లాడారు. నిరాదరణకు గురైన తల్లిదండ్రులు, వయోవృద్ధులు ఆన్‌లైన్‌లో సీనియర్ సిటిజన్ మెయింటనెన్స్ కేసెస్ మానిటరింగ్ సిస్టమ్ వెబ్ పోర్టల్ http:// tsseniorcitizens. cgg. gov. in ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల ద్వారా ఫిర్యాదు చేసేందుకు అవకాశముందన్నారు. అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సర్వేనంబర్ 72లోని అసైన్డ్ భూమి

# ఎల్ఆర్..ఎస్ అయ్యేనా!?

- క్రమబద్ధీకరణకు ఎన్‌వోసీ చిక్కులు
- దరఖాస్తుల్లో అత్యధికం అసైన్డ్‌వే
- భూముల వివరాలు కోరిన మున్సిపల్ అధికారులు

కైలాస్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన ఎల్ఆర్ఎస్ కింద ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే అందిన దరఖాస్తుల్లో ఎక్కువగా ప్రభుత్వ అసైన్డ్ భూముల్లోని ప్లాట్లు ఉండటమే కారణంగా తెలుస్తోంది. చాలాచోట్ల నకిలీ ఎన్‌వోసీతో ప్లాట్ల ఏర్పాటు బల్దియా అధికారులకు తలనొప్పిగా మారింది. సాధారణంగా ప్రైవేట్ పట్టా కలిగిన భూముల్లో వెలిసిన అక్రమ లే అవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తింపజేసేలా ప్రభుత్వం గతంలో ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగానే అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. అయితే ఆ దరఖాస్తులను పరిశీలిస్తుండగా అసైన్డ్‌భూముల్లోని లే అవుట్‌లే ఎక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో వాటిని ఎలా రెగ్యులరైజ్ చేయాలనే దానిపై మదన పడతున్నారు.

**దొడ్డిదారి ఎన్‌వోసీతో విక్రయాలు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వాలు నిరుపేద దళితుల అభ్యున్నతి కోసం గతంలో భూములను పంపిణీ చేసింది. ఆదిలాబాద్ పట్టణంతో పాటు మావల, బట్టిసావర్గాం, ఆదిలాబాద్ రూరల్ మండలాల్లోని పేదలకు వందలాది ఎకరాల భూములను ప్రభుత్వం అసైన్డ్ చేసింది. నిబంధనల ప్రకారం ఈ భూములను అమ్మడం, కొనడం కుదరదు. వీటికి ఎన్‌వోసీ జారీ చేయాలంటే కలెక్టర్‌కు మాత్రమే అధికారముంటుంది. కానీ కొంతమంది అధికారులు 1954 కంటే ముందు ప్రభుత్వం అసైన్డ్ చేసిన భూములను కాసులకు కక్కుర్తిపడి దొడ్డిదారిన ఎన్‌వోసీ జారీ చేస్తూ వచ్చారు. దీనిని సాకుగా చూపుతూ రియల్ వ్యాపారులు అసైన్డ్ భూముల్లో ప్లాట్లు చేసి విక్రయించారు. ఇందులో కొన్ని అసైన్డ్ ల్యాండ్‌లకు రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీ జారీ చేయగా, మరికొన్నింటికి నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి వాటిలో ప్లాట్లు చేసి విక్రయాలు సాగిస్తూ వచ్చారు. నిబంధనల ప్రకారం కలెక్టరేట్ నుంచి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి పంపించిన ఎన్‌వోసీ భూముల్లోని ప్లాట్లకు మాత్రమే రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉంటుంది. అయితే రియల్ వ్యాపారులు రిజిస్ట్రేషన్ అధికారులను మచ్చిక చేసుకుని ఈ తతంగం ముగించారు.

**రెవెన్యూ అండతోనే..**

రియల్ దందా జోరందుకోవడంతో కొంతమంది బడా బాబులు, రియల్టర్ల కన్ను అసైన్డ్‌భూములపై పడింది. ఇంకేముంది మావల, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ గ్రామీణ ప్రాంతాల్లోని విలువైన భూములను నయానో, బయానో తమ హస్తగతం చేసుకున్నారు. అమ్మడం, కొనడానికి వీలు లేనటువంటి భూములకు సైతం ఎన్‌వోసీలు పొందారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలే కారణమనే ప్రచారం సాగుతోంది. పరాధీనమైన అసైన్డ్ భూములను పరిశీలించి వాటిని కాపాడేందుకు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంటుంది. కలెక్టర్ పేరిట జారీ కావాల్సిన ఎన్‌వోసీలు కొంతమంది రెవెన్యూ అధికారుల పేరిట జారీ కావడం అక్రమాలకు నిదర్శనంగా నిలుస్తోంది.

**వివరాలు కోరిన బల్దియా..**

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా మున్సిపల్ అధికారులు పట్టణ పరిధిలోని ఎన్‌వోసీ భూముల వివరాలను తెలుపాలంటూ రెవెన్యూ అధికారులను కోరారు. ఈ మేరకు కలెక్టర్‌తో పాటు మావల, ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్ మండలాల రెవెన్యూ అధికారులకు లేఖలు రాశారు. వారిచ్చే వివరాల ప్రకారం ముందుకు సాగుతామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే రెవెన్యూ అధికారుల ప్రమేయంతోనే సాగిన ఈ వ్యవహారంలో వారెంతవరకు మున్సిపల్ అధికారులకు సహకరిస్తారనేదీ ప్రశ్నార్థకం. రెవెన్యూ, మున్సిపల్ శాఖలు పారదర్శకంగా సర్వే చేస్తే అక్రమాలన్నీ బయటపడే అవకాశముంటుంది. కానీ ఆదిశగా వీరు ఎంత వరకు ముందుకు సాగుతారనేదీ మరి కొన్ని రోజుల్లో తేలనుంది.

**వివరాలు కోరాం**

ఆదిలాబాద్ పట్టణంలో ఎన్‌వోసీ భూములు ఎన్ని ఉన్నాయి.. ఆ ఎన్‌వోసీ దేనిది అనే వివరాలు కావాలని రెవెన్యూ అధికారులను కోరాం. వారిచ్చే సమాచారం ప్రకారం క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం ఉంటే క్రమబద్ధీకరిస్తాం. లేదంటే తిరస్కరిస్తాం. అయితే వీటి గుర్తింపులో రెవెన్యూ అధికారుల పాత్ర కీలకం. వారు సహకరిస్తేనే ప్రక్రియ విజయవంతమవుతుంది.

– శైలజ, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

# అభివృద్ధి గురించి గంట చెప్పినా ఒడువది!



సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- బెల్లంపల్లికి బంగారు భవిష్యత్తు!
- రాబోయే రోజుల్లో మరిన్ని ఐటీ కంపెనీలు
- ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం

బెల్లంపల్లి: తెలంగాణ సాధించుకున్నాక.. సీఎం కేసీఆర్ సారథ్యంలోని ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిందని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి గంట సేపు చెప్పినా ఒడువదని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి సోమవారం బెల్లంపల్లి నియోజకవర్గంలో పర్యటించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.114.89 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. పట్టణంలోని ఏఎంసీ మైదానంలో పట్టణ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే చిన్నయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బెల్లంపల్లి వంటి పట్టణాల్లో అంత్యక్రియలకు వెళ్లే స్నానాలకు కరెంట్ ఇవ్వాలని అధికారులను వేడుకునే పరిస్థితి ఉండేదన్నారు. నాడు కరెంట్ ఉంటే వార్త అని,నేడు కరెంటు పోతే వార్త అని అన్నారు. వేసవిలో ప్రజాప్రతినిధులు గ్రామాలకు వెళ్తే మహిళలు బిందెలతో ఎదురొచ్చేవారన్నారు. నేడు ఎర్రటి ఎండలోనూ చెరువులు నిండు కుండలా ఉన్నాయని తెలిపారు. ఒకప్పుడు విత్తనాలు, రుణాలు దొరికేవి కాదని, ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో 14లక్షల మంది పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కేసీఆర్ మేనమామలా రూ.1,00,116 ఇచ్చారని అన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సింగరేణిలో కొత్తగా 19వేల మందికి ఉద్యోగాలిచ్చామని తెలిపారు. కార్మికుల రిటైర్మెంట్ వయసు 61 ఏళ్లకు పెంచామన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ.10 లక్షల వడ్డీలేని రుణం ఇస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి గురించి ఎంత చెప్పినా ఒడవదని పేర్కొన్నారు.

**పేరులో చిన్నయ్య.. పనుల్లో పెద్దయ్య..**

ఎమ్మెల్యే చిన్నయ్యపై మంత్రి కేటీఆర్ ప్రశంసల జల్లు కురిపించారు. పేరు చిన్నయ్య అయినా.. పనుల్లో మాత్రం పెద్దయ్య అని ప్రశంసించారు. సీఎం కేసీఆర్‌ను చిన్నయ్య పలుమార్లు కలిసి సింగరేణి స్థలాల్లో ఇళ్లపట్టాల కోసం పట్టుబట్టి సాధించుకున్నారని పేర్కొన్నారు. మంచి నాయకత్వాన్ని బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు వదులుకోవద్దని సూచించారు. బీఆర్ఎస్‌ను మూడోసారి గెలిపించి బెల్లంపల్లిని మరింత అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

**అభివృద్ధి నిధుల కోసం అభ్యర్థన...**

ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తగినన్ని నిధులు మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్‌ను అభ్యర్థించారు. స్థానికంగా బొగ్గు గనులు మూతపడటంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా పోయాయని తెలిపారు. యువకుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. వేమనపల్లి, నెన్నెల, కాసిపేట, తాండూర్ మండలాల పరిధిలో రోడ్ల నిర్మాణానికి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇప్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు రూ.50 కోట్లు, బెల్లంపల్లి మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేకంగా మరో రూ.50కోట్లు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గానికి అదనంగా మరో 5 వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. స్పందించిన కేటీఆర్ బెల్లంపల్లి మున్సిపాలిటీకి తక్షణం రూ.50కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

**నెరవేరిన పుర ప్రజల కల..**

బెల్లంపల్లి పట్టణ ప్రజలు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఇళ్ల పట్టాలకల ఎట్టకేలకు నెరవేరింది. ప్రభుత్వ, సింగరేణి లీజు భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి మంత్రులు పట్టాలు పంపిణీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఏడు వేల ఇళ్లకు, మరో మూడు వేల ఎస్ఆర్టీ క్వాటర్లకు పట్టాలు ఇస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. ఏఎంసీ మైదానంలో 30 మందికి పట్టాలు పంపిణీ చేశారు. మిగతావి ఎమ్మెల్యే పంపిణీ చేస్తారని తెలిపారు. కార్యక్రమాల్లో ఎంపీ వెంకటేశ్‌నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు భాగ్యలక్ష్మి, కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ క్రిశాంక్, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎమ్మెల్యేలు సక్కు, రేఖానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్ , బీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్, స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె

- 11వ రోజు బతుకమ్మ ఆడి నిరసన



బతుకమ్మతో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: 'బతుకమ్మ...బతుకమ్మ ఉయ్యాలో... మా సమస్య తీర్చాలి ఉయ్యాలో..' అంటూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట ఆడిపాడి తమ నిరసన వ్యక్తం చేశారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జేపీఎస్‌లు చేపట్టిన సమ్మె సోమవారం 11వ రోజుకు చేరింది. ఇందులో భాగంగా సర్కారు వైఖరిని నిరసిస్తూ శిబిరం వద్ద బతుకమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడేదిలేదని, సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేసేంత వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. సమ్మెకు మాల సంక్షేమ సంఘం, డీటీఎఫ్ నాయకులు మద్దతు తెలిపారు. వివిధ మండలాల సర్పంచులు సైతం తమ సంఘీభావం ప్రకటించారు.

**విధుల్లో చేరాలని కలెక్టర్ సూచన**

జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను సోమవారం తన చాంబర్‌లో కలిశారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు జేపీఎస్‌లు సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేనిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామంటూ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో జేపీఎస్‌లను తన చాంబర్‌కు పిలిపించిన కలెక్టర్ ప్రభుత్వ ఉత్తర్వుల సారాంశాన్ని వారికి వివరించారు. వెంటనే విధుల్లో చేరాలని వారికి సూచించారు. అయితే ప్రభుత్వ బెదిరింపులకు తాము భయపడేది లేదని, సమ్మెను యథాతథంగా కొనసాగిస్తామని జేపీఎస్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ అనంతరం తెలిపారు. అవసరమైన న్యాయ పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# పొలిటికల్ హీట్

- జిల్లాలో మారుతున్న రాజకీయ సమీకరణాలు
- ఎన్నికలు సమీపిస్తుండగా ఆశావహుల హడావుడి
- మొదలైన జంపింగ్‌లు

సాక్షి,ఆదిలాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. ప్రధాన పార్టీల నుంచి తమ అభ్యర్థిత్వం ఖరారు కోసం పలువురు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అవసరమైతే కండువా మార్చేందుకు సిద్ధమవుతున్నారు. ఇక అధికార పార్టీలో చిత్రమైన పరిస్థితి. దళితబంధు లబ్ధిదారుల నుంచి కమీషన్ తీసుకున్నారని సిట్టింగ్ ఎమ్మెల్యేలలో టికెట్ కోత పడే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలోఆ నియోజకవర్గాల్లో ఇతర నాయకులు అధినాయకత్వం వద్ద ప్రసన్నం పొంది ఈసారి ఎలాగైనా బరిలో నిలవాలని ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో జిల్లాలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది.

**ఏడు నెలలకే పార్టీ మార్పు..**

ఎన్ఆర్ఐ కంది శ్రీనివాస్‌రెడ్డి ఏడు నెలల క్రితమే బీజేపీ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. మునుగోడు ఎన్నికలకు ముందు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హైదరాబాద్ వచ్చినప్పుడు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ చుగ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఆదిలాబాద్ నియోజవర్గం నుంచి తనకు కమలం టికెట్ ఖాయమని విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. అంతలో ఏమైందో ఏమోగానీ.. కాషాయం కండువా వీడి సోమవారం హైదరాబాద్‌లో ప్రియాంక గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ నియోజకవర్గంలో బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో ముగ్గురు ఉండగా, కంది పార్టీ వీడడంతో ప్రస్తుతం జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ చిట్యాల సుహాసిని రెడ్డి మధ్య పోరు మిగిలింది. ఈ పరిణామాలన్ని రాజకీయంగా ఆసక్తి కలిగిస్తున్నాయి.

**దళితబంధు దుమారం..**

ఉమ్మడి జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో దళితబంధు పేరిట కమీషన్ వసూలు చేసిన వారి చిట్టా తన వద్ద ఉందని ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. ఈసారి వారికి టికెట్ ఇవ్వకపోవచ్చనే ప్రచారం జోరందుకుంది. ఇదిలా ఉంటే కొంతమంది నాయకులు కేటీఆర్ ప్రసన్నం కోసం విస్తృత ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా కేటీఆర్‌తో కలిసి నేరడిగొండ జెడ్పీటీసీ అనిల్ జాదవ్, కొంతమంది నాయకులతో ప్రత్యేక విమానంలో అక్కడికి వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో బోథ్ నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న వారితో ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు పోటీ నెలకొంది. అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలో జాన్సన్ నాయక్ కూడా కేటీఆర్‌తో కలిసి ఢిల్లీ వెళ్లిన వారిలో ఉన్నారు. ఈ పరిణామం బోథ్, ఖానాపూర్ నియోజవర్గాల్లో చర్చకు దారి తీసింది. వచ్చే ఎన్నికల్లో టికెట్ మార్పులు ఉంటాయన్న ప్రచారం పార్టీలో జరుగుతుంది.

# పారదర్శకంగా 'డబుల్' లబ్ధిదారుల ఎంపిక

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ట్రయల్ రన్ పరిశీలన
- నేడు మార్కెట్‌యార్డులో లక్కీ డ్రా



డబుల్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ట్రయల్ రన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుల ఎంపిక పక్రియపై సోమవారం నిర్వహించిన ట్రయల్ రన్‌ను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇళ్లులేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం పథకం కింద నిర్మాణాలు చేపట్టి అందిస్తుందన్నారు. పట్టణ పరిధిలోని 32 వార్డులకు చెందిన అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం ఉదయం 8 గంటలకు లక్కీడ్రా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆదిలాబాద్ పట్టణ తహసీల్దార్ సతీశ్, నాయబ్ తహసీల్దార్ మహేశ్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు పెండింగ్‌లో ఉంచొద్దు

- అదనపు కలెక్టర్ రిజ్వాన్
- గ్రీవెన్స్‌లో దరఖాస్తుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్

కైలాస్‌నగర్: ప్రజావాణిలో అందించే అర్జీలు పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ బాధితులకు భరోసా కల్పించాలని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు అందజేస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్‌వో కిరణ్‌కుమార్, మార్కెటింగ్ ఏడీ శ్రీనివాస్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నలంద ప్రియా పాల్గొన్నారు. అర్జీదారుల్లో కొందరి నివేదన.

**ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగం**

నార్నూర్ మండలం భీంపూర్ సర్పంచ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. రెండేళ్లుగా గ్రామ సభలు, నెలవారీ మీటింగ్‌లు నిర్వహించకుండా ఫోర్జరీ సంతకాలతో నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. సర్పంచ్‌పై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

–పెందూర్ రుక్మాబాయి,ఉప సర్పంచ్, భీంపూర్

**ప్రభుత్వ కార్యక్రమాలకు పిలవట్లేదు**

మా గ్రామంలో చేపట్టే ప్రభుత్వ కార్యక్రమాలకు అధికారులు నాకు సమాచారం ఇవ్వడంలేదు. ఈ నెల 6న వేంకటేశ్వర ఆలయంలో రూ.5లక్షల నిధులతో నిర్మించిన వంటషెడ్ కార్యక్రమానికి నన్ను పిలవలేదు. ఈ మేరకు వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించా.

– సిడాం బాగీర్తబాయి, ఛరంపూర్ సర్పంచ్

**భూమి సరిహద్దులు నిర్ణయించలేదు**

దళితబస్తీ కింద 2019లో మాకు మూడెకరాల చొప్పున భూమి పంపిణీ చేశారు. ఇదే మీ భూమి అంటూ చూపించి వెళ్లారు. నాలుగేళ్లవుతున్నా ఇప్పటికీ సరిహద్దులు నిర్ణయించి ఇవ్వలేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా సర్వేయర్ పట్టించుకోవడం లేదు. చుట్టు పక్కల చేన్ల వారు భూమిలోకి వచ్చి దున్నుకుంటున్నారు. ఇదేమని అడిగితే తమ భూమేనని అంటున్నారని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరుతున్నాం.

– దళితబస్తీ లబ్ధిదారులు, లేఖర్‌వాడ, జైనథ్

**రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారు**

ఇంద్రవెల్లి నుంచి దస్నాపూర్ వరకు మంజూరైన రింగ్ రోడ్డు పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఇప్పటికే ఈ రోడ్డుపై ఉన్న కల్వర్టులు తొలగించారు. పనులు చేపట్టకుంటే సిరికొండ మండలం పోచంపల్లి సహా 13 గ్రామాలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి వస్తోంది. 30 ఏళ్ల నుంచి ఉన్న రోడ్డును అడ్డుకోవడం సరికాదు.

– పోచంపల్లి గిరిజనులు, సిరికొండ

క్లుప్తంగా

## విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మురళీ, గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల నవీన్ కుమార్ అధ్యక్షతన సోమవారం సర్వసభ్య సమావేశానికి వారు హాజరయ్యారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సంఘం సహాయ కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలకు జైలు

నిర్మల్‌టౌన్: ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలకు ఆరునెల ల జైలు శిక్షతోపాటు, ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ న్యాయమూర్తి ఆర్.అజయ్‌కుమార్ సోమవారం తీర్పునిచ్చారు. కోర్టు సమన్వయల అధికారి సత్రియనాయక్ తెలిపిన వివరాలు..ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల జిల్లాకు చెందిన నీలిసికరి శ్రీను అలియాస్ షికారి అశోక్, నీలిసికరి గున్ని అలియాస్ షికారి శివపై పలు పోలీస్‌స్టేషన్లలో హత్య, దొంగతనం కేసులు నమోదయ్యాయి. 2022 నవంబర్ 24న నిర్మల్‌లోని మంజులాపూర్‌కు వచ్చి గుడిసెలు వేసుకున్నారు. అదే ఏడాది డిసెంబర్ 1న చిట్యాల శివారులోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములు నిద్రిస్తుండగా రూ.80 వేల విలువ గల నాలుగు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. దీనిపై నిర్మల్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌లో రాజు ఫిర్యాదు చేశారు. ఎస్సై చంద్రమోహన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. ఏపీపీ సీహెచ్ సతీశ్ 9 మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టడంతో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి తీర్పును వెలువరించారు.

## పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని రాంనగర్‌కు చెందిన మల్లెపూల ప్రణయ్ (29) సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం..రాంనగర్‌కు చెందిన ప్రణయ్ తండ్రి నర్సారెడ్డి ఆర్టీసీలో కండక్టర్‌గా ఉద్యోగం చేసేవారు. గతంలో రోడ్డు ప్రమాదంలో ఆయన రెండు కాళ్లు విరిగాయి. అప్పటినుంచి ఇంటివద్దే ఉంటున్నారు. తండ్రి ఉద్యోగం తనకు ఇవ్వాలని ప్రణయ్ ఆర్టీసీలో దరఖాస్తు చేసుకున్నాడు. ఉద్యోగం రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. మనస్తాపం చెందిన ఆయన మావల శివారు ప్రాంతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు వినయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

## రైలు కిందపడి బాలిక..

తలమడుగు: మతిస్థిమితం కోల్పోయిన బాలిక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. మండలంలోని పల్సి(కే) గ్రామానికి చెందిన నైతం సౌజన్య (15) గత కొన్ని నెలలుగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతోంది. ఈ క్రమంలో సోమవారం ఇంటి నుంచి వెళ్లి కప్పర్‌దేవి, డోర్లి సమీపంలోని రైల్వేగేట్ నెంబర్ 142, 5-6 వద్ద పర్లీ–ఆదిలాబాద్ వైపు వస్తున్న ప్యాసింజర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో రైల్వే పోలీసు భగవాండ్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు.

# పులి కోసం.. జింకల పునరుత్పత్తి

- జన్నారంలో రూ.83 లక్షలతో కేంద్రం ఏర్పాటు
- చివరి దశలో పనులు
- జూన్ నుంచి ప్రారంభం


పునరావాస కేంద్రంలో జింకలు


పనులు పరిశీలిస్తున్న ఎఫ్‌డీవో మాధవరావు

జన్నారం:జాతీయ జంతువు పులి. అయితే పులి వేటకు సరిపడా వన్యప్రాణులు లేకపోవడంతో జింకల సంఖ్య పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలో జింకల పునరుత్పత్తి కేంద్రం నిర్మిస్తున్నారు. ఇక్కడి నుంచి జింకలను అవసరమైన చోటకు తరలిస్తారు.

**పదేళ్లయినా పత్తాలేని పులి..**

కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేసి సుమారుగా పదేళ్లు అవుతోంది. కానీ, ఇప్పటి వరకు ఒక్క పులిని కూడా ఇందులో గుర్తించలేదు. పులులు రాకపోవడం, వచ్చినా స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. అధికారుల లెక్కల ప్రకారం టైగర్‌జోన్‌లో ఒక చదరపు కిలోమీటర్‌కు అన్ని రకాల జంతువులు కలిపి 40 నుంచి 50 వరకు ఉండాలి. కానీ కవ్వాల్ టైగర్ జోన్‌లో మాత్రం 20 మాత్రమే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పులి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలంటే వన్యప్రాణుల సంతతి పెంచాల్సిన అవసరం ఉన్నందున ఆదిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌తోపాటు వివిధ టైగర్‌జోన్‌లో పులి ఆవాసాలున్న ప్రాంతంలో వన్యప్రాణుల సంఖ్య తక్కువగా ఉంటే అవసరమున్న చోటకు జింకలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మొదటిసారిగా జన్నారం అటవి డివిజన్‌లో జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని(ఎన్సిటివ్ కన్జర్వేషన్ బ్రీడింగ్ సెంటర్) ఏర్పాటు చేస్తున్నారు.

**రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు..**

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ తాళ్లపేట్ రేంజ్ మల్యాల అడవుల్లో ఏర్పాటు చేసే జింకల పునరుత్పత్తి కేంద్రం కోసం అధికారులు రూ.1.40 కోట్లతో ప్రతిపాదనలు చేశారు. కానీ కంపా(కాంపెన్‌సేషరీ ఎన్‌ఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్) నుంచి రూ.83 లక్షలు మాత్రమే మంజూరు చేశారు. పనుల కోసం గతేడాది మార్చి 25న టెండర్ నిర్వహించారు.

**ఐదు ఆడ జింకలకు ఒక మగ జింక..**

కన్హా టైగర్ రిజర్వ్‌జోన్‌లో మాదిరిగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జింకల పునరుత్పత్తి కేంద్రంలో ఒక మగ జింక, ఐదు ఆడ జింకల చొప్పున ఉంచుతారు. మొదటి దశలో 40 జింకలను తీసుకువచ్చి ఇందులో ఉంచుతారు. వాటి సంతానం పెంపుదల కోసం పునరుత్పత్తి కేంద్రంలో అన్ని సౌకార్యాలు ఏర్పాటు చేస్తారు. సహజంగా వచ్చే గడ్డి, నీటి సౌకర్యం కోసం సోలార్ పంపు, కుంటను నిర్మించారు. ఇందులో వన్యప్రాణులు సహజంగా పెరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులకోసారి ఆహారం అందిస్తారు.

**40 హెక్టార్లలో ఏర్పాటు..**

సుమారుగా 40 హెక్టర్ల పరిధిలో జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రెండు దశలుంటాయి. మొదటి ఇందుకు 40 హెక్టార్లలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అందులో అన్ని వసతులు కల్పిస్తారు. మరో ఐదు హెక్టర్లు చిన్న ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేస్తారు. పునరుత్పత్తి అయి వాటి సంఖ్య పెరగగానే వాటిని అవసరమైన చోటికి తరలించే ఏర్పాట్లు చేస్తారు. అయితే చిన్న ఎన్‌క్లోజర్ నిర్మాణం వాటికి ఇబ్బంది లేని విధంగా ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**జూన్‌లో ప్రారంభం..**

జింకల పునరుత్పత్తి కేంద్రం పూర్తి కావస్తున్నందున జూన్‌లో జింకలను ఇక్కడికి తీసుకువచ్చే యోచనలో అధికారులున్నారు. మొదటి దశలో 40 జింకలను తీసుకువచ్చి వాటికి ఏర్పాట్లు చేస్తారు. వాటి సంతతి పెరిగిన కొద్దీ అవసమైన వాటిని ఇక్కడ ఉంచి, మిగతావి పులి సుస్థిర ప్రదేశానికి తరలిస్తారు. మొదటి దశలో పునరుత్పత్తి విజయవంతం అయితే ఈ పునరుత్పత్తి కేంద్రం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

**జూన్‌లో ప్రారంభిస్తాం**



కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో చుక్కల దుప్పుల సంతతి పెంచేందుకు జింకల పునరుత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కాంపా స్కీం కింద రూ.83 లక్షలు మంజూరయ్యాయి. పనులు చివరి దశలో ఉన్నాయి. జూన్‌లో జింకలను తీసుకువచ్చి పునరుత్పత్తి కేంద్రాన్ని ప్రారంభిస్తాం.

– మాధవరావు, ఎఫ్‌డీవో, జన్నారం

## శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలి

- ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


సామగ్రి అందజేస్తున్న వరుణ్‌రెడ్డి

ఉట్నూర్‌రూరల్: గిరిజన మత్స్య సహకార సొసైటీ సభ్యులు శిక్షణ పొంది ఆర్థికాభివృద్ధి సాధించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కె.వరుణ్‌రెడ్డి అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఉట్నూర్ మండలం కోపర్‌ఘడ్, మత్తడిగూడ, జైనూర్ మండలం కోహకగూడ చెందిన మత్స్య సహకార సొసైటీ సభ్యులకు చేపలు పట్టేందుకు రూ.2లక్షల 43 వేల విలువైన ఉచిత శిక్షణ సామగ్రిని సోమవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ చేపలు పట్టేందుకు గిరిజన మత్స్యకారులు శిక్షణ పొంది ఆదాయం పెంచుకోవాలన్నారు. సొసైటీలోని ప్రతీ సభ్యుడు శిక్షణ పొంది ఉపాధి అవకాశాలను పెంచుకోవాలని కోరారు. జిల్లాలో ప్రతీ సొసైటీ ఆదర్శ సొసైటీలుగా తయారు కావాలన్నారు. అన్ని సొసైటీలకు శిక్షణ అందించాలని పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్ రావ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో రాంబాబు, సంబంధిత సొసైటీ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్


అర్జీలు స్వీకరిస్తున్న రాహుల్‌రాజ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గిరిజన దర్బార్ నిర్వహించారు. పలువురు గిరిజనుల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. గ్రీవెన్స్‌లో ఒకే అర్జీదారు పలుమార్లు రాకుండా సమాధానం, వివరణ ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. ఉపాధి కోసం నిరుద్యోగ యువత నుంచి అధికంగా దరఖాస్తులు వచ్చాయని వారికి జాబ్‌మేళా నిర్వహించాలని జేడీఎం నాగభూషణ్‌ను ఆదేశించారు. ట్రైకార్ రుణాలు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏవో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సహస్ర లింగార్చన





ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల సంకటమోచన హనుమాన్ మందిరంలో సహస్ర లింగార్చన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ దీక్షాపరులు బంకమన్నుతో వెయ్యి లింగాలు తయారుచేసి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కిశోర్ పంతులు, స్వాములు మల్లేశ్, మహేశ్, సుదర్శన్, సురేందర్, చంద్రశేఖర్, సతీశ్, సౌరభ్, వికాస్, నవీన, సిద్ధార్థ్, అడెల్లు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# 108 ఆదివాసీ జంటల పెళ్లికి @ 21ఏళ్లు



ఈ ఫొటోలో ఉన్న కోవలింగు, జంగుబాయి దంపతులు. మారుమూల గిరిజన ప్రాంతమైన నేరడిగొండ(జి)లో ఉండేవారు. 2002 మే 9న పోలీసులు మీ కోసంలో భాగంగా సాముహిక వివాహాల్లో వీరి పెళ్లి జరిగింది. ప్రసుతం నిర్మల్ జిల్లా పెంబి మండలం రాగిదుబ్బలో ఐదెకరాల పోడు సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.


ఇచ్చోడలో పెళ్ల జంటలు (ఫైల్)

- ఇచ్చోడలో సామూహిక వివాహాలు
- ఆదివాసీ యువత నక్సలిజం వైపు వెళ్లకుండా..
- ఆదిలాబాద్ జిల్లాలో పోలీసులు మీకోసం కార్యక్రమం

ఇచ్చోడ: జంట ఒక్కటైతే.. అది కల్యాణం, అనేక జంటలు ఒక్కటైతే లోక కల్యాణం. అలాంటి సంఘటన సరిగ్గా 21 ఏళ్ల క్రితం ఆదిలాబాద్‌లోని ఇచ్చోడ మండల కేంద్రంలో జరిగింది. మే 9, 2002లో 108 ఆదివాసీ జంటలకు సామూహిక వివాహాలు జరిపించి, పోలీసులు మీకోసం అనే నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రారంభించిన ఆ కార్యక్రమం నేడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఫ్రెండ్లీ పోలీసు వైపు అడుగులు వేసింది. అప్పట్లో ఆదిలాబాద్ జిల్లా మారుముల గిరిజన గ్రామాల్లో ఆదివాసీ యువతలో నక్సలిజం ప్రభావం ఉండేది. సానుభూతి పరులుగా ఉండేవారు. వారిని అటు వైపు మళ్లకుండా అప్పటి ఎస్పీ మహేశ్ భగవత్ చర్యలు తీసుకున్నారు. రాయిసెంటర్ సార్‌మేడీలతో సమావేశాలు నిర్వహించి సామూహిక వివాహాలు జరిపించారు. జనజీవన స్రవంతిలో కలిసినవారికి పోలీసు హోంగార్డుల ఉద్యోగాల్లో తీసుకున్నారు.

**నక్సలైట్లకు పట్టు..**

ఆదిలాబాద్ జిల్లాలో నక్సలైట్లకు మంచిపట్టు ఉంది. యువత నక్సలిజం పట్ల ఆకర్షితులవడం, చేరడం, వారి కార్యకలాపాలు ఉధృతంగా జరిగేవి. వీటిని అరికట్టేలా, వారిని నక్సలిజం వైపు వెళ్లకుండా అప్పటి ఎస్పీ మహేశ్ భగవత్, ఓఎస్డీ దేవేంద్ర సింగ్ చౌహాన్, కలెక్టర్ రామకృష్ణారావులు అప్పటి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి పోలీసులు మీకోసం కార్యక్రమాన్ని చేపట్టింది. నక్సలిజం వైపు వెళ్లకుండా 108 జంటలకు పెళ్లిలు జరిపించారు. తాళిబొట్టు, నూతన వస్త్రాలు, 20 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. మూడు ప్రత్యేక బస్సుల్లో వారిని తిరుపతిలో శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించారు.


అప్పటి ఇచ్చోడ ఎస్సై శివప్రసాద్‌కు ఫోన్‌లో మాట్లాడుతున్న ఆనాడు పెళ్లి చేసుకున్న కుంరం భీంరావు

**హాజరైన ప్రముఖులు**

మే 9, 2002లో జరిగిన సామూహిక వివాహాలకు ప్రముఖులు హాజరయ్యారు. ఉమ్మడి అంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జౌళిశాఖ మంత్రి పడాల భూమన్న, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గోడం నగేశ్, ఎమ్మెల్యేలు, కలెక్టర్ రామకృష్ణారావు, ఎస్పీ మహేశ్ భగవత్, ఓఎస్డీ దేవేంద్రసింగ్ చౌహాన్, ఆదివాసీ సంఘల, నాయకులు దాదాపు 20 వేల మంది పాల్గొన్నారు.

**సంతోషంగా ఉంది**



108 ఆదివాసీ జంటలకు పెళ్లిలు జరిపించడం మరిచిపోలేని జ్ఞాపకంగా నిలిచిపోయింది. 21 ఏళ్ల క్రితం తాను పెళ్లి చేసిన భీంరావుతో సాక్షి సోమవారం ఫోన్‌లో మాట్లాడించడం సంతోషంగా ఉంది.

– శివప్రసాద్, అప్పటి ఇచ్చోడ ఎస్సై

# జోరుగా మొరం తవ్వకాలు

- యథేచ్ఛగా తరలింపు
- క్వారీ ఉన్న చోట పొక్లెయిన్‌తో తవ్వకాలు
- చూసీచూడనట్టుగా అధికారులు


గతనెల 28న 9 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ క్వారీ ఇదే

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పనుల పేరుతో జిల్లాలో క్వారీల నుంచి మొరం తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. గ్రామాల శివారు ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. క్వారీ ఉన్న చోట ఒక్కొక్క చోట రెండేసీ, మూడేసీ పొక్లెయిన్లు ఏర్పాటు చేసి తవ్వకాలు చేపడుతున్నారు. ప్రతిరోజు వేలాది టిప్పర్ల మొరం తవ్వకాలు చేపట్టి కాంట్రాక్టర్లు లక్షల రూపాయలు దండుకుంటున్నారు. గుట్టలు, చెరువులను పట్టించుకోకుండా వ్యాపారులు తవ్వేస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**గాలిలో కలుస్తున్న ప్రాణాలు**

అక్రమంగా మొరం తరలించిన చోట వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మొరం తవ్విన చోట కనీసం చుట్టూ ఎలాంటి కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో పిల్లలు సరదా కోసం వెళ్లి ఈత రాక ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి.

- దేవాపూర్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు 2017 అక్టోబర్‌లో గ్రామ సమీపంలోని మొరం క్వారీలో ఈత కోసం వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందారు.
- 2020 జనవరిలో భుక్తపూర్‌కు చెందిన మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలు జిల్లా కేంద్రంలోని ఆర్టీవో కార్యాలయం పక్కన గల మొరం తవ్వి వదిలేసిన నీటి గుంతలో పడి మృతి చెందింది.
- 2021 ఏప్రిల్‌లో ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ శివారు ప్రాంతంలో అక్రమంగా వెలిసిన మొరం క్వారీలో పడి 13 ఏళ్ల బాలుడు మృతిచెందాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో 9 ఏళ్ల బాలుడు క్వారీలో పడి చనిపోయాడు.

**గనుల శాఖ నుంచి అనుమతి పొందాలి**

భూమిని చదును చేసేందుకు వీలుగా మొరం తరలించాలంటే కచ్చితంగా గనుల శాఖల నుంచి అనుమతి పొందాలి. పట్టా భూముల్లో మొరం తరలించాలంటే హెక్టార్‌కు రూ. 40వేల చొప్పున గనుల శాఖకు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. క్యూబిక్ మీటర్‌కు రూ.30 చెల్లించాలి. దీంతో పాటు 2 శాతం ఆదాయ పన్ను, ఒక శాతం కార్మిక పన్ను కట్టాల్సి ఉంటుంది.

**అనుమతి లేదు**

జిల్లాలో మొరం తవ్వకాలు చేపట్టేందుకు ఎలాంటి అనుమతి లేవు. అక్రమంగా తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లకు ఉత్తర్వులు జారీచేశాం. తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదు అందితే తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం.

– రవిశంకర్, మైనింగ్, ఏడి, ఆదిలాబాద్

## ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

భీమిని: మండలంలోని రాంపూర్ క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ ఘటనలో భీమిని మండలానికి చెందిన కొట్రంగి రవికి తీవ్ర గాయాలు కాగా బెల్లంపల్లికి చెందిన సాయి, అతడి మిత్రుడికి స్వల్ప గాయాలయ్యాయి. బెల్లంపల్లిలో నిర్వహించే మంత్రి కేటీఆర్ మీటింగ్‌కు బైక్ ర్యాలీలో వెళ్తుండగా ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలైన రవిని మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు కరీంనగర్‌కు రెఫర్ చేశారు. అక్కడ అతడికి వైద్యం అందిస్తున్నట్లు బంధువులు తెలిపారు.

## పెర్సాపెన్‌కు పూజలు



నార్నూర్: మండలంలోని దానుగూడలో ఆదివాసీ గిరిజనులైనా పెందూర్ వంశానికి చెందిన గాడ్వోరికార్ పెర్సాపెన్ (పెద్దదేవుడు)నికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగా పెళ్లయిన 20 జంటలకు భేటి కోర్యాడ్‌గా తయారు చేసి పెర్సాపెన్ దేవుడితో సంప్రదాయం ప్రకారం భేటి చేశారు. ప్రతి ఏదాది పెర్సాపెన్ దేవతకు ఆదివాసీ సంప్రదాయం, ఆచారం ప్రకారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని పూజారి పెందూర్ భీంరావు, గ్రామ పటేల్ రఘునాథ్ అన్నారు. పెందూర్ రాంషావ్, పెందూర్ జాకేశ్, పెందూర్ యాదోరావు, భీంరావు, యశ్వంతరావు తదితరులు పాల్గొన్నారు.


కొత్తగా పెళ్లయిన 20 జంటలను పెద్దదేవుడి వద్ద భేటి నిర్వహిస్తున్న పెద్దలు